క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



పాగోడులో విద్యార్థులతో ఉపాధ్యాయులు

జలుమూరు: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని, కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని ఎంఈఓ బి.మాధవరావు అన్నారు. పాగోడు, చెన్నయవలసలో ఆయా గ్రామాల ఉపాధ్యాయులతో శుక్రవారం క్యాంపెయిన్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే ఉచితంగా భోజనం, పుస్తకాలు, దుస్తులు, బూట్లు అందిస్తామన్నారు. క్రమశిక్షణ కలిగి ఉంటారన్నారు. ఉపాధ్యాయులు ఎం.అప్పన్న, పి.పరసయ్య పాల్గొన్నారు.

మరింత రుచిగా మధ్యాహ్న భోజనం



మాట్లాడుతున్న ఎంఈఓ రమణ

సారవకోట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం ద్వారా అందించే ఆహారం రుచికరంగా ఉండాలని ఎంఈఓ ఎం.వి.రమణ సూచించారు. సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులకు పీఎం పోషణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శిక్షణ నిర్వహించారు. నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఎంఈఓ–2 కె.భూలక్ష్మి, హెచ్ఎంలు రామకృష్ణ, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రసాదరావు

సారవకోట: ఎన్నికల అనంతరం గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండాలని నరసన్నపేట సీఐ ప్రసాదరావు సూచించారు. మండలంలోని అలుదు పంచాయతీ వడ్డినవలసలో ఎన్నికల అనంతరం జరుగుతున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి ఘర్షణలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల రోజు సైతం ఇక్కడున్న ఇరు పార్టీల వారు ఘర్షణకు దిగారని, ఇదే పరిస్థితి కొనసాగితే క్షమించేది లేదన్నారు. ఎస్ఐ అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

చాపరలో కార్డన్ సెర్చ్



చాపరలో కార్డన్ సర్చ్ నిర్వహిస్తున్న సీఐ సాయి, పోలీసులు

మెళియాపుట్టి: ఎన్నికల విధుల్లో భాగంగా చాపర గ్రామంలో పాతపట్నం సీఐ నల్లి సాయి, స్థానిక ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పలు వీధులలో పోలీసులు తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల నియామావళిలో భాగంగా ప్రజలు కోడ్ ఉల్లంఘనకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో మెలగాలని పిలుపునిచ్చారు. ఫలితాలు వెలువడిన రోజు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసుకుని గొడవలు పడొద్దని, అటువంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాలలో పోలీసుల నిఘా ఉంటుందని, శాంతిభద్రతకు సహకరించాలన్నారు. పాతపట్నం ఎస్సై మహమ్మద్ యాసిన్, పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

• ఉపాధి వేతనదారుల ధర్నా



రోడ్డుపై కూర్చుని నిరసన తెలియజేస్తున్న ఉపాధి వేతనదారులు

బూర్జ మండలంలో గల లక్కుపురం గ్రామంలోని వేతనదారులు ఉపాధి పనులు కల్పించాలని పాలకొండ– శ్రీకాకుళం లక్కుపురం కూడలిలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. పనిదినాలు ఉన్నప్పటికీ ఉపాధి పనులు కల్పించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలు కురవనందున వ్యవసాయ పనులు లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. రహదారిపై వాహనాల రాకపోకలు నిలుపుదల చేశారు. రెండు వారాలు మాత్రమే పని కల్పించారని, ప్రస్తుతం పనులు చేపట్టక పోవడంతో ఖాళీగా ఉండాల్సి వస్తుందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే పనులు కల్పించాలని కోరారు. ఉపాధి ఏపీఓ వి.రాజీకుమార్ వద్ద ఈ విషయం ప్రస్తవించగా.. లక్కుపురంలో ఉపాధి పనులు రెండు వారాల్లో ప్రారంభిస్తామన్నారు. వేతనదారులు అధైర్య పడనవసరం లేదన్నారు.

– బూర్జ

• పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్..

నరసన్నపేట మండలంలోని 83 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 5,460 మంది విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలను విద్యా శాఖ సిద్ధం చేస్తుంది. ఈ మేరకు గురు, శుక్రవారాల్లో పాఠ్యపుస్తకాలు స్థానిక బోర్డు స్కూల్లోని స్టోర్ రూమ్‌కు చేరాయి. మండలానికి 43,700 పుస్తకాలు అవసరం కాగా శుక్రవారం నాటికి 23,400 పుస్తకాలు వచ్చాయని ఎంఈఓలు యు.శాంతారావు, పేడాడ దాలినాయుడు తెలిపారు. 8, 9, 10వ తరగతులకు చెందిన పుస్తకాలు నేరుగా ముద్రణా కార్యాలయం నుంచి వస్తున్నాయన్నారు. మిగిలిన తరగతుల పుస్తకాలు శ్రీకాకుళం సెంట్రల్ బుక్ స్టోర్ నుంచి వస్తున్నట్లు తెలిపారు. జూన్ 12న స్కూల్స్ తెరిచే నాటికి అన్ని స్కూళ్లకు పుస్తకాలు చేర్చుతామన్నారు.

– నరసన్నపేట



పుస్తకాలను అన్‌లోడ్ చేస్తున్న సిబ్బంది

• భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర



ఆంజనేయ స్వామికి శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

హనుమత్ జయంతి మహోత్సవాల సందర్భంగా నరసన్నపేటలోని పెద్దపేట రోడ్డులో గల శక్తి ఆంజనేయ స్వామివారికి శుక్రవారం శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో యాత్రలో పాల్గొన్నారు. ఆంజనేయ స్వామిని శివశంకర వరప్రసాద్ శర్మ పుష్పాలతో అలంకరించారు. ప్రధాన వీధుల్లో శోభాయాత్ర చేపట్టారు. శనివారం హనుమత్ జయంతి సందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయంలో ఉదయం సుప్రభాత సేవతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేస్తామని వార్డు సభ్యులు పి.కృష్ణప్రసాద్, స్థానిక నాయకుడు పాగోటి రాజారావు తెలిపారు.

– నరసన్నపేట

సాదాసీదాగా మండల సమావేశం

పొందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కిల్లి ఉషారాణి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి చర్చలు చేయలేదు. మండల పరిషత్ నిర్వహణకు సంబంధించిన ఖర్చులను మాత్రమే ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ చదివి వినిపించారు. బోర్ మెకానిక్‌లకు జీతాలు మార్చి, ఏప్రిల్, మే నెలలకు గాను 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి చెల్లింపులు, కార్యాలయపు విద్యుత్ చార్జీలు చెల్లించేందుకు సాధారణ నిధుల వినియోగం, 15 శాతం ఎస్సీ కార్పొరేషన్‌కు జమ చేయాల్సిన నగదు సాధారణ నిధుల నుంచి డ్రా చేసేందుకు, కార్యాలయం కంటింజెంట్ ఖర్చులు నిమిత్తము ఆమోదంపై సభలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఖరీఫ్‌కు కావాల్సిన వరి విత్తనాలను సిద్ధం చేయాలని సభ్యులు కోరారు. ఈఓపీఆర్డీ సింహాచలం, ఎంపీటీసీలు వండాన శ్రీదేవి, కూన ప్రమీల, కిల్లిన సూర్యారావు, వడగ పార్వతి, వడగ పద్మావతి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పొందూరు: మాట్లాడుతున్న ఎంపీడీఓ సూర్యనారాయణ



పొందూరు: సమావేశానికి హాజరైన సభ్యులు



మెళియాపుట్టి: మాట్లాడుతున్న ఎంపీపీ ఈశ్వరమ్మ

మెళియాపుట్టిలో..

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని ఉపాధి హామీ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. విద్యాశాఖకు సంబంధించి ఎంఈఓ దేవేంద్రరావు మాట్లాడుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. ఈ ఏడాది పది ఫలితాలలో సైతం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు 99 శాతం మార్కులు తెచ్చుకున్నవారు ఉన్నారని తెలియజేశారు. వచ్చే నెల 5వ తేదీ తర్వాత నుంచి రాయితీపై రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తామని వ్యవసాయశాఖ అధికారి తెలిపారు. రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూస్తామని, దోమల మందు సైతం పిచికారీ చేయిస్తున్నామని మెళియాపుట్టి పీహెచ్‌సీ వైద్యులు గ్రీష్మ అన్నారు. ఎంపీపీ ఈశ్వరమ్మ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధికి సభ్యులందరూ సహకరించాలని కోరారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో సర్వసభ్య సమావేశం సాదాసీదాగా నిర్వహించారు. జెడ్పీటీసీ గూడ ఎండయ్య, వైస్ ఎంపీపీ ఆదినాయుడు, అలికాన మాధవరావు, ఎంపీడీఓ జి.భాస్కరరావు, మండల పరిపాలన అధికారి తిరుపతి పట్నాయక్ పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

చెత్త సంపద తయారీ కేంద్రాల పరిశీలన



సేంద్రీయ ఎరువులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రమణ



పాతపట్నం: కొదూరులో చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌ఓ ఐ.వి.రమణ

మెళియాపుట్టి: గ్రామాలలో తడి, పొడి చెత్తలను వేరుచేసి వాటితో సేంద్రీయ ఎరువులను తయారు చేయాలని డీఎల్‌పీఓ ఐ.వి.రమణ అన్నారు. మండలంలోని పరశురాంపురం గ్రామంలోని చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. సేకరించిన చెత్తతో సేంద్రీయ ఎరువును తయయారు చేయడం వల్ల రైతులు ఆరోగ్యదాయకమైన పంటలు పండించవచ్చునని, అంతేకాకుండా గ్రామ పంచాయతీకి ఆదాయం పెంచవచ్చన్నారు. చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాల వల్ల గ్రామాలు పరిశుభ్రవాతావరణంలో ఉంటాయన్నారు. కార్యదర్శి శివాజీ, వీపీఏ శరత్, పలువురు రైతులు పాల్గొన్నారు.

కొదూరులో..

పాతపట్నం: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని టెక్కలి డీఎల్‌పీఓ ఐ.వి.రమణ అన్నారు. మండలంలోని కొదూరు గ్రామ పంచాయతీలోని చెత్త సంపద కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి ప్రతి గ్రామ పంచాయతీలోనూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ప్రజలు కూడా బాధ్యత వహించి ఇళ్లల్లో ఉన్న చెత్తను రోడ్లపై, వీధుల్లో వేయకుండా వాహనాల్లోనే వేయాలని సూచించారు. తడి, పొడి చెత్త వేరుచేసి వానపాముల ద్వారా ఎరువుల తయారు చేయాలన్నారు. ఈఓపీఆర్డీ టి.కృష్ణారావు, కోఆర్డినేటర్ చిన్నబాబు, ఈఓ టి.కూర్మారావు, సెక్రటరీలు రాము, హరిత గార్డ్, రాయబారులు పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపు



హిరమండలం: సుభలయలో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న సహిత ఉపాధ్యాయులు



బూర్జ: ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

హిరమండలం: మండలంలో ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపు సర్వే కొనసాగుతుంది. సర్వేలో భాగంగా సుభలయ గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు ఐఆర్టీ సీతంనాయుడు శుక్రవారం తెలిపారు. దృష్టిలోపం కలిగిన బాలికలను గుర్తించామన్నారు. మూడేళ్ల నుంచి 18 ఏళ్ల వయసున్న దివ్యాంగులను గుర్తించి చదువుకు దూరంగా ఉండే వారిని వారి సమీపంలోని పాఠశాలలో చేర్పేలా చర్యలు తీసుకుంటామన్నారు. భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ క్యాంప్‌లు, హోమ్ టెస్ట్ విద్య, తదితర సేవలపై అవగాహన కల్పించామన్నారు. సహిత ఉపాధ్యాయుడు గోవిందరావు, ఆశ కార్యకర్త పి.భాను పాల్గొన్నారు.

బూర్జ మండలంలో..

బూర్జ: మండలంలోని అన్ని గ్రామాలలో ప్రత్యేకావసరాల పిల్లల గుర్తుంపు సర్వే నిర్వహిస్తున్న ట్లు ఎంఈఓలు ఎస్.శ్యామసుందరరావు, బి.ధనుంజయరావు తెలియ జేశారు. ఏపీపేట, అన్నంపేట, అయ్యవారిపేట, ఉప్పినివలస, కొల్లివలస గ్రామాలలో శుక్రవారం ఇంటింటా సర్వే నిర్వహించారు. 3 నుంచి 18 ఏళ్ల లోపు విద్యార్థులను గుర్తించేందుకు మే 1 నుంచి జూన్ 9వ తేదీ వరకు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని క్లస్టర్ల పరిధిలోని దివ్యాంగ విద్యార్థులకు భవిత పాఠశాలలో చేర్పించి, వారికి ప్రభుత్వం తరపున ప్రత్యేక అలవెన్స్‌లతోపాటు వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్లు, వీల్‌చైర్‌లు, సీపీ చైర్‌లు, తదితర పరికరాలు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. దివ్యాంగ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలన్నారు. జిల్లా సహిత విద్యా కో ఆర్డినేటర్ గోవిందరావు, మండల సహిత విద్యా కో ఆర్డినేటర్, ఉపాధ్యాయులు పాగిరి సూర్యనారాయణ, దువ్వాడ రమణ, ఎమార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

గొడవలు సృష్టిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్ఐ నారాయణస్వామి

హిరమండలం: ఎన్నికల కౌంటింగ్ రోజు గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ జి.నారాయణ స్వామి హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులు నమ్మి గొడవలు చేయవద్దన్నారు. ఎన్నికల కౌంటింగ్ రోజు అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రజలు గుమిగూడటం, బాణసంచా కాల్చడం, సంబరాలు చేసుకోవడం, రంగులు చల్లుకోవడం, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టడం వంటివి పూర్తిగా నిషేధించామన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడి



ఏఓ సంధ్య

హిరమండలం: భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగుచేస్తే రైతులు అధిక దిగుబడి సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి బమ్మిడి సంధ్య సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో మాట్లాడారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో ఖరీఫ్ సీజన్ సంబంధించి రైతుల తమ పొలాల్లో మట్టి నమోనాలు సేకరిస్తున్నారన్నారు. సేకరించిన మట్టి నమూనాలను అగ్రి ల్యాబ్‌కు పంపి రిపోర్టు అందజేస్తారన్నారు. భూసార పరీక్షలకు అనుగుణంగా పటంలు సాగుచేయడం, సూచించిన ఎరువులు వాడితే మంచి దిగుబడులు ఉంటాయన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి హానికరం



నరసన్నపేట: ప్రతిజ్ఞ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

నరసన్నపేట: పొగాకు ఉత్పత్తుల వల్ల ఆరోగ్యానికి హానికరమని ఉర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి సుజాత అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉర్లాం పీహెచ్‌సీ వద్ద సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుజాత మాట్లాడుతూ ఎటువంటి పొగాకు ఉత్పత్తులను వినియోగించకూడదని అన్నారు. పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ప్రతీ ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

జలుమూరు..

జలుమూరు: పొగాకు ఉత్పత్తులతో ఆరోగ్యం పాడవుతుందని జలుమూరు పీహెచ్‌సీ మెడికల్ అధికారి తాడేల శ్రీకాంత్ అన్నారు. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే నష్టాలు వివరించారు. దీనిపై సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

కొత్తూరు: ఉపాధి వేతనదారులు పనులు చేస్తున్న సమయంలో వేసవి జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. మండలంలోని ఆకులతంపరలో శుక్రవారం ఉపాధి పనులను ఎంపీడీఓ పరిశీంచారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రభుత్వం నిర్ధేశించిన సమయానికి పనుల్లో చేరాలన్నారు. ప్రతీ వేతనదారుడు వెంట తాగునీరు తీసుకురావాలన్నారు. పనుల్లో సమయపాలన పాటించాలన్నారు. ప్రజలకు ఉపయోపడేలా పనులు చేయాలన్నారు. నిర్ధేశించిన కొలతల ప్రకారం పనులు చేసినప్పుడే గరిష్ఠ వేతనం పొందవచ్చన్నారు. మస్తర్లను పరిశీలించారు.

కుక్కల స్వైరవిహారం

పాతపట్నం: మండల కేంద్రంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇటీవల కంద్రవీధి, శివశంకర్ కాలనీ, జుబ్లీహిల్స్ రోడ్డు, కాపువీధి, బ్రాహ్మణవీధి, అచ్చుతాపురం, కోర్టు జంక్షన్, ఆస్పత్రి జంక్షన్‌లో కుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగుతున్నాయి. చిన్నపిల్లలు, విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. పాతపట్నం శివశంకర్ కాలనీకి చెందిన సంతోష్‌కుమార్, రాము, సతీష్‌లపై బస్టాండ్‌లో ఇటీవల కుక్కలు దాడి చేయడంతో గాయలయ్యాయి. మండలంలోని కొరసవాడ, కాగువాడ, బూరగాం, గంగువాడలో రాత్రిళ్లు భయటకు రావాలంటే భయమేస్తుందని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. కొరసవాడలో చికెన్ షాపులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ల్లో విసిరెసిన కోళ్ల మాంసాలు కుక్కలు తింటున్నాయని, అవి ప్రజలపై దాడులు చేస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. గతంలో రెండు ఆవులకు కుక్కలు కరిచాయన్నారు. దీనిపై పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని స్థానికలు కోరుతున్నారు.



పాతపట్నంలో మెయిన్ రోడ్డులో కుక్కల గుంపు

4 నుంచి యోగా శిబిరం

నరసన్నపేట: స్థానిక సూర్యనారాయణస్వామి ఆలయం ఎదురుగా ఉన్న యోగా భవనంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వేసవి ప్రత్యేక హ్యాపీనెస్ ప్రోగ్రాం (యోగా శిబిరం) ఆరు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆసక్తి ఉన్నవారు పాల్గొనచ్చని యోగా గరువు సందీప్ శుక్రవారం కోరారు. జూన్ 4 నుంచి 9వ తేదీ వరకు రోజూ ఉదయం 5.30 నుంచి 8.30 గంటల వరకు యోగా తరగతులు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు 90145 86930 నంబర్‌కు ఫోను చేసి తెలుసుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సందీప్ వివరించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఆమదాలవలస: మెండ విమలమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ 8వ వార్షికోత్సవం సందర్భంగా ఆమదాలవలస పట్టనం చిట్టెమ్మ క్వార్టర్స్‌లో గల చర్చి ఆవరణంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు సంస్థ అధ్యక్షుడు శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాగోలు జెమ్స్ ఆస్పత్రి నుంచి వైద్య నిపుణులు వస్తారన్నారు. గుండె, సుగర్ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

• చిరుజల్లులు..

కొత్తూరు/నరసన్నపేట: గత కొద్దిరోజులుగా తీవ్రమైన ఎండలతో ప్రజలు అవస్థలు పడ్డారు. శుక్రవారం సాయంత్రం కొత్తూరు, నరసన్నపేట మండలాలతో పలుచోట్ల చిరుజల్లులు కురవడంతో వాతావరణం ఒక్కసారి చల్లబడింది. ప్రజలకు ఉక్కపోత నుంచి కొంత ఉపసమనం కలిగింది.



కొత్తూరు: కొత్తూరులో కురుస్తున్న వర్షం



నరసన్నపేట: నరసన్నపేటలో వర్షం కురుస్తున్న దృశ్యం